09ATP27_09ATP27.qxd 21-10-2024 PM 10:21 Page 1






## దక్షిణకన్నడ జిల్లా స్థానిక సంస్థల నుంచి ఎంఎల్‌సి సీటుకు ఎన్నికలు

- ఉత్సాహంగా పోలింగ్‌లో ప్రజా ప్రతినిధులు



దక్షిణకన్నడ జిల్లా మంగళూరులో ప్రారంభమైన ఎంఎల్‌సి పోలింగ్ దృశ్యం.

**మంగళూరు,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

లోక్‌సభ ఎన్నికల్లో ఉడుపి చిక్కమగళూరు ఎంపీగా కోటా శ్రీనివాసపూజారి గెలవటంతో ఆయన తన ఎంఎల్‌సి సీటుకు రాజీనామాచేశారు. ఈసీటుకు సోమవారం పోలింగ్ జరిగింది.దక్షిణకన్నడ జిల్లా స్థానిక సంస్థల నుంచి సభ్యులు ఎంఎల్‌సిను ఎన్నుకుంటారు.ఇది గతంలో బిజెపి సీటుగా ఉంది.సిట్టింగ్ సభ్యుడి రాజీనామాతో ఇవాళ పోలింగ్ జరిగింది.బిజెపి నుంచి కిశోర్‌కుమార్ బొట్యాడి, కాంగ్రెస్ నుంచి రాజు పూజారి ఎన్నికల్లో నిలబడ్డారు.వీరుకాకుండా మరో ఇద్దరు ఇండిపెండెంట్లుగా బరిలో ఉన్నారు.ఈజిల్లాలో 6032మంది స్థానికసంస్థల సభ్యులు ఉంటే వీరికోసం 392 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.సాయంత్రం 4.00గంటల వరకు పోలింగ్ జరిగింది.ఎన్నికల ఫలితాలను ఈనెల 24న ప్రకటిస్తారు.మంగళూరులోని కోడియాలబైల్ ఏరియాలోని సెంట్ అలోషియస్ పియుసి కాలేజిలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.మంగళూరులో ఉదయంనుంచి ప్రజాప్రతినిధులు వరుసలో నిలబడి ఓటువేశారు.

## మాజీ డిసిఎం ఈశ్వరప్ప నాయకత్వంలో రాయణ్ణ చెన్నమ్మ బ్రిగేడ్ ఏర్పాటు సంక్రాంతికి ప్రారంభం

**బాగలకోట,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**



బాగలకోటలో కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వరప్ప

కర్ణాటకలో వెనుకబడిన కులాల నాయకుడిగా పేరు తెచ్చుకునేందుకు బిజెపి మాజీ నాయకుడు మాజీ మంత్రి కెఎస్. ఈశ్వరప్ప వచ్చే సంక్రాంతికి కొత్త బ్రిగేడ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆయన ఈమేరకు బాగలకోటలో జరిగిన కొత్త సంఘటన్ గురించి పలువురు స్వామీజిలతో సమావేశం అయ్యారు.తాను ప్రారంభించే కొత్త సంఘానికి రాయణ్ణ చెన్నమ్మ బ్రిగేడ్ (ఆర్‌సిబి)గా నామకరణం చేస్తునట్లు ప్రకటించారు.గతంలో బిజెపిలో ఉపముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాయణ్ణ బ్రిగేడ్‌ను ఏర్పాటుచేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటే ఆనాడు మాజీ సిఎం యడ్యూరప్ప తనకు అడ్డుపడి బిజెపి హైకమాండ్‌పైన వత్తిళ్లు తెచ్చి రాయణ్ణ బ్రిగేడ్ ఏర్పాటును రద్దు చేయించారు.ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో తాను స్వతంత్ర అభ్యర్థిగా శివమొగ్గలో పోటీ చేసి యడ్యూరప్ప పెద్దకొడుకు రాఘవేంద్ర చేతిలో ఓటమి పాలయ్యారు.అప్పటికే ఆయన్ని పార్టీనుంచి సస్పెండ్ చేశారు.తన రాజకీయ జీవితంలో రెండో ఇన్నింగ్స్‌ను రాయణ్ణ చెన్నమ్మ బ్రిగేడ్ ద్వారా పరీక్షించుకోనున్నారు.వచ్చే సంక్రాంతినాటికి బీదర్‌లోని కూడలసంగమ వద్ద కొత్త సంఘాన్ని ఏర్పాటు చేస్తామని ఈశ్వరప్ప ప్రకటించారు.సమావేశంలో ఈయన వెంట ప్రముఖ కురుబ సమాజం నాయకులు పాల్గొన్నారు.

## కల్బుర్గిజిల్లాలో కుటుంబ గొడవలకు విసిగి వేసారిన గృహిణి ముగ్గురు పిల్లలకు విషం తాగించి ఆత్మహత్య ప్రయత్నం

**చింఛోళి (కల్బుర్గి జిల్లా ) ,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని కల్బుర్గి జిల్లా చింఛోళి తాలూకా జంగ్లిపీర్ తాండాలో సోమవారం ఒక గృహిణి ఇంటిగొడవలతో విసిగి తన ముగ్గురు చిన్నారులకు జ్యూస్‌లో విషం కలిపి తాను తాగి పిల్లలకు తాగించి ఆత్మహత్య ప్రయత్నం చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జంగ్లిపీర్ తాండాకు చెందిన గీతాబాయి రాథోడ్ ఇవాళ ఉదయం భర్తతో గొడవపడి తన ఏడాదిన్నర పసికందుతో సహ తన ముగ్గురు పిల్లలు లక్ష్మి,ధనుష్,చైతన్యలకు విషం కలిపిన జ్యూస్ తాగించింది.నాలుగేళ్లలోపు పిల్లలకు ఇదేమీ తెలియక జ్యూస్ తాగి కడుపునొప్పితో బాధపడుతుంటే ఇరుగు పొరుగు ప్రజలు పిల్లలను చింఛోళి ఆసుపత్రికి తీసుకువెళ్లారు.ఆసుపత్రిలో పిల్లలు చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.కాగా గీతాబాయి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.ఈమేరకు చింఛోళి పోలీసు స్టేషన్‌లో కేసునమోదు అయ్యింది.

## గదగ జిల్లాలో జోరువానలకు నీటమునిగిన ఉల్లిగడ్డలు

-లక్షల రూపాయల పంట నష్టం రైతు దిగాలు

**గదగ,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

కర్ణాటకలో రెండురోజులుగా కొనసాగుతున్న జోరువానలు అన్ని జిల్లాలను తడిపి ముద్దచేసింది.మధ్యకర్ణాటక ప్రాంతంలోని గదగ జిల్లా లక్ష్మేశ్వర తాలూకా ఆదరకట్టి గ్రామంలో వివిధ రైతులు పండించిన ఉల్లిపాయల పంట కోతకు వచ్చిన సమయంలో జోరు వానల వలన పంట పొలాల్లోకి వాననీరు చేరుకుని 40ఎకరాల్లోని ఉల్లిపాయల పంట నీట మునిగిపోయింది. మొన్నటివరకు ఈ ప్రాంతంలో వాతావరణం పొడిగా ఉండటంతో రైతులు ఉల్లి కోతను ప్రారంభించి పంటను పొలాల్లో ఆరబెట్టుకున్నారు.ఈలోపు అర్ధంతరం వానల ఉల్లిపంట నీటమునిగిపోయింది.20మంది రైతులు సాగుచేసిన ఉల్లిపాయలు నీటిలో మునిగి కుళ్లిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు.గదగ మార్కెటుకు ఉల్లిగడ్డలను తరలించి అక్కడి ఎపిఎంసిలో అమ్ముకుని నాలుగు కాసులు చేతిలో చూద్దామనుకున్న రైతులు ఇపుడు పంట నష్టంతో దిగాలు చెంది దిక్కులు చూస్తున్నారు.సోమవారం ఈ రైతులు పంట పొలాల్లో నీట మునిగిన ఉల్లిపాయల పంటను చూసి తమను సర్కారు పంటనష్టం కింద ఆదుకోకపోతే లక్షల రూపాయల అప్పులు తీర్చేదారి లేదన్నారు.సర్కారు అధికారులు వెంటనే ఉల్లి పంట నష్టం అంచనా వేసి రైతులకు పంటనష్టం పరిహారంకింద సాయం అందించాలని కోరారు.లక్షల రూపాయలు అప్పుచేసి ఉల్లిపాయల పంటను సాగుచేస్తే అకాల వర్షాల వలన తమకు నష్టం వాటిల్లిందని చెప్పారు.కాగా కర్ణాటకలో ఇపుడు మార్కెట్ల కొద్ది సంఖ్యలో ఉల్లిగడ్డల పంట రావటంతో బయట మార్కెటులో కిలో ఉల్లి ధర 50రూపాయల ధర పలుకుతుంది.రైతులకు లాభాలను తెచ్చే ఈపంట ఇపుడు రైతులకు కన్నీరు తెప్పిస్తోంది.

## చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో యోగేశ్వర్ పోటీ

- ఎంఎల్‌సి సీటుకు రాజీనామా
- హుబ్బళిలో సభాపతిని కలిసి రాజీనామా లేఖను సమర్పించిన యోగేశ్వర్

**చెన్నపట్టణ (రామనగర జిల్లా ),అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**



మాజీ మంత్రి సిపి.యోగేశ్వర్

రామనగర జిల్లా చెన్నపట్టణ విధానసభ ఉప ఎన్నికల్లో వీలు దొరికితే బిజెపి నుంచి లేదా స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసేందుకు బిజెపి ఎంఎల్‌సి స్థానానికి రాజీనామా చేయాలని యోగేశ్వర్ సోమవారం మధ్యాహ్నం బెంగళూరు నుంచి హుబ్బళ్లికి విమాన ప్రయాణం చేశారు.కర్ణాటక విధానపరిషత్ సభాపతి బసవరాజు హొరట్టి హుబ్బళ్లిలో తన నివాసం ఉన్నారన్న సమాచారం మేరకు ఆయన్ని వ్యక్తిగతంగా కలుసుకుని బిజెపి ఎంఎల్‌సి స్థానానికి ఇవాళ సాయంత్రం రాజీనామా చేశారు.దీంతో యోగేశ్వర్ చెన్నపట్టణ సీటులో పోటీ అనివార్యం అయ్యింది.ఎంఎల్‌సి సీటుకు రాజీనామ చేసిన తరువాతనే రామనగర జిల్లాలో ఎంఎల్‌ఎ సీటుకోసం నామినేషన్ వేస్తారని ఆయన సహచరులు చెన్నపట్టణలో చెప్పారు.తానుఅయితే గియితే బిజెపి నుంచి ఎంఎల్ఎగా పోటీ చేస్తానే తప్పా జెడిఎస్‌తో ఇన్నాళ్ల రాజకీయపోరాటం చేసి ఇపుడు వారు టిక్కెట్టు ఆఫర్ చేశారని జెడిఎస్ గుర్తుపైన పోటీచేసే వీల్లేదని కరాకండిగా చెప్పారు.తాను ఇక్కడ నుంచి అయిదుసార్లు వేర్వేరు పార్టీల నుంచి పోటీచేసి గెలుపొందాను.ఇది నా రాజకీయ అస్తిత్వం ప్రశ్న.అందుకే ఉప ఎన్నికల్లో అన్నిటికి తెగించి పోటీచేస్తునట్లు యోగేశ్వర్ చెప్పారు.ఓటర్లుదీవిస్తే ఈసారి గెలుపొంది ఆతరువాత బిజెపిలో విలీనం అవుతానని అన్నారు.గత 30సంవత్సరాలుగా చెన్నపట్టణ విధానసభ నియోజకవర్గంలో జనతాదళ ఎస్ పార్టీతో రాజకీయంగా పోరాడుతూ నా అస్తిత్వాన్ని కాపాడుకున్నాను.ఇపుడు అవకాశం దొరికింది కదా అని ఆ పార్టీ టిక్కెట్టు పైన పోటీచేస్తే నా కేడర్‌కు ఓటర్లకు ఏమని జవాబివ్వాలని ప్రశ్నించారు.

## చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిగా జెడిఎస్ నుంచి జయముత్తు పోటీ ?

**చెన్నపట్టణ (రామనగరజిల్లా ),అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

చెన్నపట్టణ ఉప ఎన్నికల్లో జెడిఎస్ బిజెపి పార్టీల అభ్యర్థిగా జెడిఎస్ తాలూకా అధ్యక్షుడు జయముత్తు పోటీ చేయనున్నట్లు సమాచారం.ఈమేరకు సోమవారం సాయంత్రం వరకు బెంగళూరు మాజీ ప్రధాని దేవెగౌడ నివాసంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో జరిగిన తీర్మానం మేరకు జయముత్తు పోటీ చేస్తారు.ఈ సీటును బిజెపికు వదిలిపెట్టేందుకు దళపతి కుమారస్వామి ససేమిరా అనటంతో ఇన్నాళ్లు తనకు టిక్కెట్టు లభిస్తుందని ఎదురుచూసిన బిజెపి నాయకుడు యోగేశ్వర్ జెడిఎస్ వేరే అభ్యర్దిని నిలబెట్టాలని తీర్మానించటంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయటానికి సిద్ధమయ్యారు.కుమారస్వామి తనయుడు నిఖిల్ కుమారస్వామి చెన్నపట్టణలో పోటీకి నిరాకరించటంతో పార్టీ తన అభ్యర్థిగా జయముత్తు పేరును కరారు చేసింది.

## మంగళూరులో సీనియర్ యక్షగాన కళాకారుడు మృతి

**మంగళూరు,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**



తెంకుతిట్టు యక్షగాన హాస్యకళాకారుడు జయరామ ఆచార్య

కర్ణాటక కోస్తాతీరంలోని మంగళూరు ఉడుపి ఉత్తరకన్నడ జిల్లాల్లో ప్రముఖ మనరంజన కళా ప్రదర్శనల్లో యక్షగానం ప్రముఖంగా ఉంది.తెంకుతిట్టు యక్షగాన ప్రయోగాల్లో ప్రముఖంగా పేరు పొందిన సీనియర్ హాస్య కళాకారుడు బంట్వాళ్ జయరామ ఆచార్య సోమవారం గుండెపోటుతో మృతి చెందారు.ఆయనకు పత్ని ఇద్దరు కుమారులు ఉన్నారు.ఇటీవల బెంగళూరులో పుత్తూరు యక్షగానమేళంలో ప్రదర్శనలు ఇచ్చేందుకు ఆయన బెంగళూరుకు వెళ్లారు. ఇవాళ గుండెపోటుతో మృతి చెందారు.

## హాసన్ జిల్లా మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ పిటీషన్లను కొట్టివేసిన హైకోర్టు

**బెంగళూరు,అక్టోబర్ 21,ప్రభాతవార్తప్రతినిధి**

మహిళలను లైంగికంగా దౌర్జన్యం చేసి బెంగళూరు సెంట్రల్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న హాసన్ మాజీ ఎంపి ప్రజ్వల్ రేవణ్ణ బెయిల్ కోసం పెట్టుకున్న మూడుపిటీషన్లను హైకోర్టు సోమవారం కొట్టివేసింది.కెఆర్‌నగర్ మహిళ కిడ్నాప్,సర్కారు అధికారిణిపైన లైంగికదౌర్జన్యం మరియు ఇంటి పనిమనిషిపైన జరిపిన రేప్ కేసుల్లో తనకు బెయిల్ ఇవ్వాలంటూ ప్రజ్వల్ రేవణ్ణ పెట్టుకున్న బెయిల్ పిటీషన్లను బెంగళూరులో హైకోర్టు ఇవాళ కొట్టివేసింది. బెయిల్‌ను నిరాకరించింది.దీంతో ఇతడు మళ్లీ బెంగళూరు సెంట్రల్ జైల్లో రిమాండ్‌లోనే కొనసాగే పరిస్థితి దాపురించింది.

## మండ్యలో చెరువులో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

**మండ్య,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

మండ్యజిల్లా మండ్య నగరంలోని మద్దూరమ్మకెరె చెరువులో సోమవారం ఈత కొట్టేందుకు వెళ్లిన ఇద్దరు విద్యార్థులు చెర్లో మునిగి చనిపోయారు.పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇవాళ మధ్యాహ్నం మద్దూరమ్మ కెరెలో ఈత కొట్టేందుకు సోము (14),ముత్తురాజు (15) వెళ్లి చెరువులోని బురదలో చిక్కుకునిపోయి ఊపిరాడక మృతి చెందారు.ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు చెరువు వద్దకు చేరుకుని విద్యార్థులను బయటకు తీసేందుకు ఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు.ఈమేరకు మండ్య నగర పోలీసు స్టేషనులో కేసు నమోదు అయ్యింది.

## బెంగళూరులో జోరు వానలు గట్టిగెరె గ్రామంలో రోడ్లపైకి వచ్చిన చేపలు

- చేపల కోసం ఎగబడిన జనం

**బెంగళూరు,అక్టోబర్ 21,ప్రభాతవార్త ప్రతినిధి**

బెంగళూరు నగరంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వానల వలన పలుచోట్ల రాజకాలువలు పొంగిపొర్లు తుండటంతో అనేక కాలువలు వరదనీటి ప్రవాహంతో పరుగులు తీస్తున్నాయి.స్థానిక రాజరాజేశ్వరీ నగర వార్డులోని గట్టిగెరె ప్రాంతంలో సోమవారం ఉదయం అక్కడి రోడ్లపైకి ఒక్కసారిగా వేలాది చేపలు రాగా ప్రజలు వీటిని సేకరించేందుకు పోటీ పడ్డారు.రాజరాజేశ్వరీ నగర ప్రాంతంలో ఎగువన గ్రామాల చెరువులకు గండ్లు పడిపోవటంతో గట్టిగెరెగ్రామంలోని కాలువ గుండా వచ్చిన వరదనీటితో చేపలు రోడ్లమీదకు విచ్చేశాయి.దీంతో ఇవాళ ఉదయం ఈప్రాంతంలో స్థానికులు తట్టాబుట్టా చేతబట్టుకుని చేపలు ఏరుకునేందుకు ఎగబడ్డారు. సుమారు రెండుగంటల పాటు ప్రజలు రోడ్లమీద చేపలను ఉచితంగా ఏరుకుని ఇళ్లకు తీసుకువెళ్లారు. బెంగళూరు నగరంలో వానలు సృష్టించిన అవాంతరాల వలన పలుచోట్ల వరదనీటి కాలువలు పెద్దఎత్తున నీటితోప్రవహిస్తున్నాయి.వానల కారణంగా ఇవాళ బెంగళూరులో పాఠశాలలకు ప్రభుత్వం శలవు ప్రకటించింది.

## భైరవానితిప్ప సచివాలయ సిబ్బందిపై సర్పంచ్ మంజునాథ పిర్యాదు

**బ్రహ్మసముద్రం అక్టోబర్ 21 ప్రభాతవార్త,**



సర్పంచ్ పిర్యాదు దృశ్యం

మండంలోని భైరవానితిప్ప సచివాలయ సిబ్బందిపై సర్పంచ్ శెట్టిగారి మంజునాథ ఎంపిడీఓ నందకిశోర్‌కు పిర్యాధు చేశారు.సచివాలయ సిబ్బంది సచివాలయంకు సరిగా హాజరుకావడంలేదని 11 గంటలైనా ఉద్యోగులు సచివాలయంకు హాజరు కాకపోవడంపై పిర్యాదుచేశారు.సచివాలయంకు హాజరుకాకపోగా ఒక ఉద్యోగి 20వ తేదీ ఆదివారం డ్యూటీకి వచ్చినట్టు రిజిస్టర్‌లో సంతకం చేశారని అన్నారు.పలుసార్లు సచివాలయ సిబ్బంది మారాలని చెప్పినా ఫలితంలేదని ప్రజలు ఉద్యోగులతో పనిచేయించుకోవాలంటే అధికారుల కోసం ఎదురు చూసేపరిస్థితి ఏర్పడిందని రెండు మూడు రోజులు హాజరుకాకుండా వచ్చినప్పుడు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారని సచివాలయ ఉద్యోగులపై చర్యలుతీసుకోవాలని పిర్యాధుచేశారు.

## గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ

**బెలుగుప్ప, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపుతున్న పశువైద్యాధికారి

మండల పరిధిలో నక్కలపల్లి, ఎర్రగుడి గ్రామాల్లో గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందును పశువైద్య అధికారి మందును తాగించారు. ఈ సందర్భంగా గ్రామ పశువైద్యాధికారి మ ఆట్లాడుతూ.. ఈ మందు తాగడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి గొర్రెల్లోనూ మేకల్లో పాల దిగుబడి అవుతుందని, పిల్లలు కూడా బలిష్టంగా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నక్కలపల్లి సర్పంచు రామిరెడ్డి, దబ్బర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలకు రోడ్డు ఏర్పాటు చేయండి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు విన్నవించిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

**ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలకు రోడ్డును ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్‌కు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హనుమంతరాయుడు, కుళ్లాయిస్వామి విన్నవించారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. 8 సంవత్సరాల క్రితం ప్రభుత్వం గ్రామానికి కిలోమీటర్ల దూరంలోని కొండ గుట్టల ప్రాంతంలో ఆదర్శ పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాలను నిర్మించినప్పటికీ ఇప్పటి వరకు సరైన రోడ్డును మాత్రం నిర్మించలేదన్నారు. దీంతో విద్యార్థులు గతుకుల మట్టిరోడ్డులో ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. ఇదివరకే అనేకమార్లు విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రమాదాలకు గురయ్యారని వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు. వెంటనే రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి చందు, ఉపాధ్యక్షులు మంజునాథ్, వంశీ, నగర కార్యదర్శి ఉమా మహేష్, నాయకులు భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాల మైదానంలో టపాకాయల విక్రయాలకు అనుమతులివ్వొద్దు

- తహశీల్దార్‌కు విన్నవించిన ఆర్ఎస్‌యూ నాయకులు

**ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల ఉమ్మడి క్రీడా మైదానంలో టపాకాయల విక్రయాలకు అనుమతులివ్వొద్దని రేవలేషనరీ స్టూడెంట్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) నాయకులు విన్నవించారు. పట్టణంలోని మండల తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఈ మేరకు డిప్యూటీ తహశీల్దార్ భోగనగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ టపాకాయల దుకాణాల ఏర్పాటు కారణంగా క్రీడామైదనం దెబ్బతిని విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అనుమతులిస్తే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

## ఘనంగా అమరవీరుల వారోత్సవాలు

**గుత్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

గుత్తిలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం జిఆర్‌పి పోలీసు స్టేషన్‌లో అమరవీరుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగప్ప ఆధ్వర్యంలో విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసు అమరవీరులకు ఘనంగా నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తి అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులవారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా అసువులుబాసిన వీరాంజినేయులు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్ఐ పేర్కొన్నారు.

## కెఎన్‌పల్లిలో పెట్రోల్ బంక్ ప్రారంభం

**గుడిబండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



పెట్రోల్ బంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని కుంబర నాగేపల్లి గ్రామంలో పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ యజమాని తిప్పేస్వామి మాట్లాడుతూ.. మండలంలోని వాహనదారులు, పెట్రోల్, డీజిల్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భూ రీ సర్వే పట్ల గ్రామసదస్సులు

**గుత్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

మండల వ్యాప్తంగా చేపట్టిన భూ రీ సర్వే పట్ల ప్రజలకు అవగాహన నిమిత్తంనరెవెన్యూశాఖ గ్రామసభలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సోమ వారం అబ్బేదొడ్డి, ఈశ్వరపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహశీల్దార్ లత, విఆర్ఓ ఆబూబకర్, సర్వేయర్ సాయిలు మాట్లాడుతూ ప్రజలు ఎవరికైనా భూమి సంబంధిత సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. నూతనంగా చేపట్టిన ఆంధ్రప్రదేశ్ రీ సర్వే ప్రాజెక్ట్ పథకం మేరకు సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిఒక్కరు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు వహించండి

**గుమ్మఘట్ట, అక్టోబర్ 21 ప్రభాతవార్త:**



అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయని, ప్రతి ఒక్కరూ తగు జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వాటి నుండి రక్షణ పొందవచ్చునని గుమ్మఘట్ట ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ రమేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్‌లు తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంజెపిస్కూల్‌లో విద్యార్థులకు దోమ కాటువల్ల వచ్చే జబ్బులు, వాటటి నివారణ చర్యలు ఏ విధంగా తీసుకోవాలో తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నిలువ నీటిలోనే దోమలు గుడ్లు పెడతాయని, వారానికి ఒకసారి ఇంటి పరిసరాలలోని తొట్టెలు, డ్రమ్ములు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధికి ఖచ్చితమైన మందులు కానీ, టికా కానీ లేవని దోమల నివారణ ఒక్కటే మార్గమని, దోమ కాటువల్ల మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు వంటి ప్రాణాంతక వ్యాధులు వ్యాపిస్తాయని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటూ లోతట్టు ప్రాంతాలు లేకుండా చూడాలని, మురికి నీటటి నిల్వలు, మురికి కాలువలలో వారానికి ఒకసారి వేస్ట్ అయిల్ వేయాలని, వాడుకలో లేఎని కంటైనర్‌లను బోర్లించి ఉంచాలని, ఇంటి కిటికిలకు, తలుపులు దగ్గర లెట్రిన్ వెంట్ పైపుకు మెష్ వైర్ ఏర్పాటు చేసుకోవాలని, జ్వరం వచ్చిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంనకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం బీసీ హాస్టల్‌ను విజిట్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఎచ్ఓ మురళీధర్, ప్రిన్సిపల్ శ్రీదేవి, హెల్త్ సూపర్‌వైజర్ ఆది బయమ్మ, ఎఎన్ఎం సువర్ణ, హెల్త్ అసిస్టెంట్ మునీర్ మరియు ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కొనకొండ్ల జెడ్పీ హైస్కూల్ వ్యాయాయ ఉపాధ్యాయున్ని సస్పెండ్ చేయండి

-ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీకు విన్నవించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

**ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణశర్మకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎస్సీ విద్యార్థులు 77 మందికి ప్రభుత్వం 2వేల రూపాయల చొప్పున అందించిన డబ్బును వారి బ్యాంకు ఖాతాల నుండి తన సొంత అవసరాలకు డ్రా చేసుకొని వాడుకున్న వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు సత్యనారాయణను సస్పెండ్‌చేసి డబ్బును రికవరీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఓతూరు పరమేష్, సిద్దార్థ విన్నవించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల హెచ్ఎంకు తెలియకుండా డబ్బులు డ్రా చేసుకున్న వ్యాయమ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఎస్సీసీ విద్యార్థులతో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేషులు, సూర్యప్రకాష్, నగర అధ్యక్ష, కార్యదర్శులు శివ, భీమేష్ తదితరులు ఉన్నారు.

## తాలూకాలో నూతన విఎస్ఎస్ఎస్ సొసైటీలను, గోడౌన్లను ప్రారంభించిన ఎమ్మెల్యే , ఎమ్మెల్సీ

**పావగడ, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

పావగడ తాలూకాలోని సికెపుర, గుమ్మగట్ట, కోటగుడ్డ, పొన్నసముద్ర, నాగలమడకలలో నూతనంగా నిర్మించిన విఎస్ఎస్ఎస్ సొసైటీలను, గోడౌన్లను స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేష్, ఎమ్మెల్సీ రాజేంద్రలు సోమవారం ప్రారంభించారు. ఇదే సందర్భంగా గుమ్మగట్టల్లో పశువులకు కాళ్ల పుండ్లు, జ్వరం రాకుండా టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హెచ్‌వి.వెంకటేష్, ఎమ్మెల్యే రాజేంద్ర మాట్లాడుతూ.. విఎస్ఎస్ఎన్ ద్వారా రైతులు రుణాలను పొంది ఆర్థికంగా ఎదగాలన్నారు. వియస్‌యస్‌యస్ సొసైటీలు కూడా పాడి పరిశ్రమకు ప్రాధాన్యతను ఇచ్చి రైతులకు రుణాలనుఇచ్చి ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి బ్యాంక్ డైరెక్టర్ టిఎన్.నరసింహయ్య, మున్సిపల్ కౌన్సిలర్ రాజేష్, శంకర్‌రెడ్డి, సమాజ సేవకుడు ఎగువపల్లి నాని, కౌన్సిలర్ రవి, బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు రామాంజినప్ప, అన్నదానపుర లక్ష్మీనారాయణ, కేబి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 23న సర్వసభ్య సమావేశం

- ఎంపిడిఓ సాయి మనోహర్

**ధర్మవరం రూరల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



ఎంపిడిఓ సాయి మనోహర్

పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈ నెల 23వ తేది బుధవారం ఉదయం 10 గంటలకు సర్వసభ్య సమావేశంను నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సాయి మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశానికి ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు, మండల పరిధిలోని సర్పంచులు, మండల స్థాయి అధికారులు, పంచాయితీ కార్యదర్శులు సకాలంలో హాజరు కావాలని ఈ సమావేశంలో అన్ని పంచాయితీలపై అత్యవసరమైన విషయాల గురించి చర్చించబడునని ఎంపిడిఓ తెలిపారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు చిన్న హోతూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

**- 26, 26, 27 తేదీల్లో కాణిపాకంలో జరుగనున్న పోటీలు**

ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు

వజ్రకరూరు మండలం చిన్న హోతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న కె.వరుణ్ కుమార్, పి.జ్యోతి రామ్ రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసవలింగ ప్రసాద్, పీడీ ప్రభాకర్ సోమవారం తెలిపారు. ఈనెల 20న ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో అండర్-18 జూనియర్ ఖోఖో సెలెక్షన్స్ జరుగగా అందులో పాల్గొన్న ఇరువురు విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర జట్టులో స్థానం సంపాధించుకున్నారన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఇరువురు విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, మస్తాన్,మునీంద్ర, నారాయణ స్వామి, మల్లికార్జున, కృష్ణ, రజని కుమారి, సుబోస్ పాల్గొన్నారు.

## II నెలలుగా జీతాలులేక ఇబ్బందులు పడుతున్నాం..చర్యలు తీసుకోండి

**- మంత్రి పయ్యావుల కేశవ్‌కు విన్నవించిన సీపీడబ్ల్యూ స్కీమ్ కాంట్రాక్టు కార్మికులు**

ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



మంత్రి పయ్యావుల కేశవ్‌కు సమస్యలను వివరిస్తున్న సీపీడబ్ల్యూ స్కీమ్ కాంట్రాక్టు కార్మికులు

తాము 11 నెలలుగా జీతాలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తగిన చర్యలు తీసుకొని జీతాలు అందేలా చేసి వివిధ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఉరవకొండ సీపీడబ్ల్యూ స్కీమ్ కాంట్రాక్టు కార్మికులు విన్నవించారు. సోమవారం మంత్రి ఇంద్రావతి గ్రామంవద్ద హంద్రీనీవా కాలువ పరిశీలనకు రాగా ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్మికులు మాట్లాడుతూ తాము గత 24 సంవత్సరాలుగా 24 మంది స్కీమ్‌లో పనిచేస్తున్నామని అయితే మాకు నెలనెలా జీతాలు అందక అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. తమకు 11 నెలల జీతాలే కాకుండా 2 సంవత్సరాల నుండి ఈపీఎఫ్ ఖాతాలకు జమ చేయడం లేదని, ఈఎస్ఐ కూడా కట్టలేదన్నారు. స్కీమ్ కాంట్రాక్టర్ జనార్ధనరెడ్డికి ప్రభుత్వం బిల్లులు చెల్లించినప్పటికీ మాకు జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ జమ చేయలేదని వివరించారు. దీంతో స్పందించిన మంత్రి పయ్యావుల కేశవ్ కాంట్రాక్టర్‌పై పోలీసులకు పిర్యాదు చేయాలని అక్కడేవున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మురళీధర్, డీఈఈ అంజుమన్ సఫ్రీన్‌లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు భాషా, ఉమాపతి, రామాంజినేయులు, తిప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

## జల్లిపల్లి టోల్‌ఫ్లాజాలో కనీస సౌకర్యాలు కల్పించండి

**- కలెక్టర్‌కు విన్నవించిన బీసీవై పార్టీ నియోజవకర్గ ఇంచార్జ్ బెస్త పవన్‌కుమార్**

ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు విన్నవిస్తున్న దృశ్యం

కూడేరు మండల పరిధిలోని జల్లిపల్లి టోల్‌ఫ్లాజాలో కనీస సౌకర్యాలులేక వాహనదారులు ఇబ్బందులు పడ్డాలని వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బెస్త పవన్‌కుమార్ విన్నవించారు. జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు వివిధ సమస్యల పరిష్కారానికి వినతిపత్రం అందించారు. బెస్త పవన్‌కుమార్ మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలోని వెలిగొండ, షేక్షానుపల్లి, గుంతకల్లు, కణేకల్లు రోడ్లకు ఇరువైపులా గ్రామ పంచాయతీ వారు చెత్తను వేస్తున్నారని దీనికారణంగా ప్రజలు ఇబ్బందులు పడటమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా చెట్లు పెరగడంలేదన్నారు. ఈ విషయమై పలుమార్లు పంచాయతీ కార్యదర్శికు విన్నవించినా స్పందన లేదన్నారు. పట్టణంలోని చికెన్ కబాబ్, చికెన్ సెంటర్ల నిర్వాహకులు కోళ్ల వ్యర్థాలను మురుగు కాలువల్లో, రోడ్లపైన వదిలేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతే కాకుండా కోళ్ల వ్యర్థాలతో కబాబ్ ఇతరత్రా పదార్థాలను తయారుచేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

## 3 కోట్లతో మండలంలో సిమెంట్ రోడ్లు

అగళి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

ఉపాధిహామీ పథకంలో భాగంగా గ్రామాలకు మహర్ధశ ఏర్పడింది. అగళి మండలంలోని 13 పంచాయితీల పరిధిలో 3 కోట్ల విలువైన సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఏపిఓ శివన్న తెలిపారు. ప్రతి పంచాయితీలోనూ 20 లక్షల వరకు రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వం పల్లె పండుగలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని చేపట్టిన పనులను 3 నెలల్లో పూర్తి చేయాలని కాల పరిమితి విధజంచినట్లు తెలిపారు. రోడ్లను నిర్మిస్తే గ్రామాలకు మహర్ధశ ఏర్పడుటుంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో అధికంగా సిసి రోడ్లను నిరి ్మంచారు. ఇప్పుడు కూడా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

## సమయపాలన, అంకితభావంతో విధులు నిర్వహించాలి -ఎంపిడిఒ

గుత్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త



ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ మాట్లాడుతున్న దృశ్యం

మండల వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని సచివాలయాల్లో వున్న సిబ్బంది సమయపాల పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలని ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంక్షేమ విభాగం కార్యదర్శులు, ఏఎన్ఎంలు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితర సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజారోగ్యం దృష్ట్యా తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 10 నుండి 10.30 గంటలలోపు ఖచ్చితంగా హాజరు నమోదు చేసుకోవాలన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో విధులు నిర్వహించాలని ఎంపిడిఒ సూచించారు. లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమిని కేటాయించండి

**- కొనకొండ్లలో ఎస్ఎస్ ట్యాంక్ ఫిల్టర్ బెడ్ల మార్చేందుకు చర్యలు తీసుకోండి - జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను కోరిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి**

ఉరవకొండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండల పరిధిలో 132 కేవీ విద్యుత్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి గాను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని విద్యుత్ శాఖకు భూమిని కేటాయించాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ఎమ్మెల్సీ, శాసన మండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మెన్ వై.శివరామిరెడ్డి కోరారు. సోమవారం ఆయన జిల్లా కేంద్రం అనంతపురంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి నియోజకవర్గంలోని వివిధ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిని కేటాయించాలని రెవెన్యూశాఖను కోరినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణానికి 5 ఎకరాల భూమి అవసరమవుతుందని వెంటనే కేటాయించాలన్నారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల గ్రామంలోగల సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ద్వారా 20 గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతోందని అయితే ఫిల్టర్ బెడ్లు చెడిపోయాయని కొత్త ఫిల్టర్ బెడ్లను ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో రెండు నూతన మైక్రో ఫిల్టర్ బెడ్లు అదనంగా ఉన్నాయని వాటిని కొనకొండ్లకు తరలించడానికి రవాణా ఖర్చులు ప్రభుత్వం మంజూరు చేయాలన్నారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఫిల్టర్‌కాని కలుషిత నీటిని తాగడంవల్ల ప్రజలు సీజినల్ వ్యాధుల బారినపడే అవకాశం ఉందన్నారు. ఫిల్టర్ బెడ్లను వెంటనే మారి ్చ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అధిక వర్షాలతో వేరుశెనగ రైతులు నష్టపోయారని ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి కోరారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుంతకల్లు, అక్టోబర్ 21 ప్రభాతవార్త

పట్టణంలోని మార్కెట్‌యార్డు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డిప్యూటి ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కె.నాగేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్బంగా పట్టణంలోని రాజేంద్రనగర్, ఎస్ఎల్‌వి థియేటర్, రామస్వామి దేవాలయం, సత్యనారాయణపేట ప్రాంతాల్లో ఉదయం 9 నుండిసాయంత్రం 5గంటలవరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## టిడిపి మాజీ సర్పంచు పార్థివదేహానికి నివాళులు

గుంతకల్లు, అక్టోబర్ 21 ప్రభాతవార్త



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అనిల్‌కుమార్‌గౌడ్

మండలంలోని నాగనముద్రం మాజీ సర్పంచు ఓబులప్ప ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి యువనాయకులు అనిల్‌కుమార్‌గౌడ్ సోమవారం మృతుని స్వగృహానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి ఆర్థిక సాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాగసముద్రం టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

అమరాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అమరాపురంలో సోమవారం పోలీసుఅమరవీరుల దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా ఎఎస్ఐ రామాంజినేయులు ఆధ్వర్యంలో అమరాపురం ఉన్నత పాఠశాల విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో జెడ్‌పిహెచ్ స్కూల్ విద్యార్థులు, విద్యార్థినిలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలతో కలిసి పోలీసు సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు. అమరవీరులైన పోలీసుల సేవలను ఈ సందర్భం గా ఎఎస్ఐ వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్రీనాథ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## నేడు హేమావతిలో చేపల పెంపకంపై వేలంపాట

అమరాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

మండలంలోని హేమావతి గ్రామ పరిధిలోని హింజేరు చెరువులో చేపల పెంపకంకు సంబంధించి మంగళవారం వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను చేపల పెంపకం మరియు అమ్మకాలు చేయుటకు సాగు అనుభం హక్కులు నిర్ణయించుటకు గ్రామ పంచాయతీ సర్పంచు తిప్పేస్వామి, విస్తరణాధికారి నాగముని ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగవేలం నిర్వహించడం జరుగుతుందని ఇందులో పాల్గొనేవారు 10 వేల రూపాయల దరావత్తు చెల్లించి పాల్గొనవచ్చున్నారు. వేలం దక్కించున్న వారు అదే రోజు పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి వుంటుందని సర్పంచు తిప్పేస్వామి, గ్రామ కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఐ ధర్నా

గుత్తి, అక్టోబర్ 21 ప్రభాతవార్త




సిపిఐ కార్యకర్తలు ధర్నా చేస్తున్న దృశ్యం

ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా కార్యదర్శి రామ దాసు మాట్లా డుతూ కాలనీల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయాలని, రోడ్లను పునరుద్ద రించాలని, మెరుగైన పారిశుద్ధ్య వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహులు, వెంకటరాముడు, నజీర్, డేనియల్, రామకృష్ణ, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గురైన రైతు కుటుంబాలను ఆదుకోండి

**- ఏపి రైతు సంఘం**

పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 21 ప్రభాతవార్త

సత్యసాయి జిల్లాలో అధిక వర్షాల కారణంగా దబ్బతిన్న పంటలు,పిడుగుపాటుకు గురై మరణించిన రైతు కుటుంబాలను యుద్ధప్రాతిపదికన ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు అడపాల వేమనారాయణ,మహదేవులు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ జాయింట్ కలెక్టర్‌లకి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మీడియాతో వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లాలోని 32 మండలాలలో దాదపు 300 ఎకరాలలో అధిక వర్షం కారణంగా వరి,పత్తి,మొక్కజొన్న,వేరుశనగ,కంది పంటలు తీవ్రంగా నష్టపోయారని అదేవిధంగా ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలని ఉపాధి హామీలు జరుగుతున్నటువంటి అవినీతి సోషియల్ ఎడిట్ ద్వారా వెలికి తీసి ఉపాధి హామీ నిధులను రాబట్టాలని ఆదేవిధంగా సత్యసాయి జిల్లాలో ఉన్నటువంటి చుక్కల భూములకు విముక్తి కల్పించి రైతులకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేశారు.

## ప్రశాంతంగా కేజీబీవీ ఉద్యోగుల దరఖాస్తులు సర్టిఫికెట్లు పరిశీలన

కొత్తచెరువు అక్టోబర్ 21 ప్రభాతవార్త



సిఆర్‌టి ల దరఖాస్తుల సర్టిఫికెట్లును పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీసత్యసాయి జిల్లా కేజీబీవీలో ఖాళీగా ఉన్న టీచింగ్ పోస్టుల సిఆర్‌టి పిజిటి టిజిటి అకౌంటెంట్ వార్డెన్ కు ఆన్లైన్ ధరఖాస్తు చేసుకున్న అభ్యర్ధులకు 1;5 నిష్పత్తిలో సోమవారం బుక్కపట్నం సమగ్రశిక్ష కార్యాలయంలో పిఎస్,డిఈవో మీనాక్షి ఆధ్వర్యంలో అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్‌లను వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు.ఉదయం 9;30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగింది ఈ ప్రక్రియకు జిల్లా వ్యాప్తంగా 70 పోస్టులకు 345 మందికి గాను 161 మందికి అభ్యర్థులు మాత్రమే వెరిఫికేషన్ ప్రక్రియకు హజరైన అభ్యర్ధులకు అధికారులు షామియా కుర్చీలు త్రాగునీటి తదితర వసతులు కల్పించారు ఈ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందని అధికారులు తెలిపారు.

## డిపిఓ ని కలిసిన అసోసియేషన్ సభ్యులు

పుట్టపర్తి రూరల్ అక్టోబర్ 21 ప్రభాతవార్త



పుష్పగుచ్చం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇటీవల నూతనంగా భాధ్యతలు చేపట్టిన జిల్లా పంచాయతీ అధికారి సమత నీ శ్రీ సత్యసాయి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్బంగా అసోసియేషన్ అధ్యక్షురాలు నసీమా,బుక్కపట్నం ఈ ఓ ఆర్‌డి అశోక్ కుమార్ రెడ్డి,కొత్త చెరువు నటరాజ్, డిపిఓని కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పంచాయితీలలో నెలకొన్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చి అభివృద్ది పనులను పకడ్బందీగా నిర్వహించాలని.ప్రజలకు ఎలాంటి సమస్యలు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని విధి నిర్వహణలో నిబద్ధత్వ వ్యవహరించాలని ఆమె కోరారు.ఆయా మండలాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన తమ దృష్టికి తీసుకురావాలని లేదా మీరే నివృత్తి చేయాలని కోరారు.

## నేడు మండలంలో ప్రజా దర్బార్ రెవెన్యూ సమస్యల పరిష్కార వేదిక

**- ఎమ్మెల్యే పరిటాల సునీత**

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి, ఎంపిడిఓ కార్యాలయంలో రెవెన్యూ సమస్యల కోసం, ప్రజా దర్బార్ సమస్యల పరిష్కారం, వేదిక మంగళవారం నిర్వహిస్తున్నట్లు, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశంకు రాప్తాడు నియోజకవర్గ ఎమ్మెల్యేపరిటాల సునీత అలాగే ధర్మవరం ఆర్‌డిఓ చెన్నేకొత్తపల్లి మండల అధికారులతో కలిసి రైతులకు సంబంధించి దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో భూ సమస్యలున్న ప్రతి ఒక్కరూ పాల్గొని మీ సమస్యలకు పరిష్కరించుకోవాల్సిందిగా తెలియజేశారు.

## పల్లె పండుగ కార్యక్రమం

కుందుర్పి, అక్టోబర్ 21 ప్రభాతవార్త



పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా అభివృద్ది కార్యక్రమాలకు భూమి పూజ చేస్తున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొన్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కుందుర్పి మండల కేంద్రంలో టిడిపి కార్యకర్త మఠం అనిల్ తోటలో గోకుల ఆవులు షెడ్డునిర్మించుటకు టిడిపి కార్యకర్తలు మాజీ ఎంపిటిసి మల్లికార్జున మాజీ గ్రామ సర్పంచు పెద్ద నరసింహప్ప, గ్రామ సర్పంచు రామ్మూర్తి, మారుతేశ్వరి, టౌన్ కరీం నగర్ రంగనాథ బేల్దారి వెంకటేషులు రామ్మూర్తి గ్రామ పెద్దలు కార్యకర్తలు ఆవు షెడ్డు నిర్మించుటకు భూమి పూజ చేశారు.

## వివిధ శాఖల అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

కనగానపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త



మాట్లాడుతున్న ఏపిఎం హేమలత

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దారు, ట్రాన్స్‌కో, అగ్రికల్చర్ అధికారులు గైర్హాజరపై ఎంపిటిసిలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వ సభ్య సమావేశానికి దుమ్మా కొట్టిన అధికారులు ప్రతిరోజు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారో లేదో ఈ గైర్హాజరే ఇందుకు నిదర్శనమని వారు ఎంపిడిఓ అనిల్‌కుమార్‌తో వాదించారు. గైర్హాజరైన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎంపిడిఓకు తెలియజేశారు. ఎంపిడిఓ మాట్లాడుతూ.. గైర్హాజరైన అధికారులపై ఉ న్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ప్రజా ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బోగే నరసింహారెడ్డి, ఎంఈఓలు 1, 2, అరుణమ్మ, శ్రీదేవి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి, పిహెచ్‌సి డాక్టర్ చెన్నారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబా ఫకృద్దీన్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ షకీల్, పిఆర్ జేఈ పుండరీకాక్షరెడ్డి, ఎంపిపి భాగ్యమ్మ, ఎంపిటిసిలు పూజారి రత్నమ్మ, కృష్ణారెడ్డి, సర్పంచులు దాసిరెడ్డి, రేవతి రాజాకృష్ణ, మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఉచిత ఇసుక

**- అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు - ధర్మవరం ఆర్డిఓ మహేష్**

ధర్మవరం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



ఆర్డిఓ మహేష్

ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో మాదిరిగానే ఎద్దుల బండి నిర్వాహకులు, ట్రాక్టర్ యజమానులు ఉచితంగా ఇసుక రవాణా చేసుకునేందుకు అనుమతి ఉండేదని ప్రస్తుతం కూడా రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం ఇల్లు కట్టుకునే యజమాని ఆధారంగా చేసుకుని యజమాని ద్వారానే ట్రాక్టర్‌లో ఉచిత ఇసుక తీసుకెల్లడానికి అనుమతి మంజూరు చేయడం జరిగిందన్నారు. రవాణా ఖర్చుతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ఉచితంగా ఇసుకను పంపినీ చేస్తోందని వారు గుర్తు చేశారు. సొంత ఇంటి నిర్మాణానికి మాత్రమే ఇసుకను ఉపయోగించాలని, అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అది కూడా ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతించబడుతుందన్నారు. టిప్పర్లకు ఎటువంటి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల్లో సిసి రేవు, పిసి రేవు వద్ద నుంచి ఉచితంగా ఇసుకను పొందే అవకాశం కూడా ఉందని తె లిపారు. ఈ ఉచిత ఇసుక పంపిణీ చట్టపరంగా, ప్రభుత్వం నిర్ణయించిన షరతులు మేరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## అమరవీరుల ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దాం- డిఎస్పీ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త



పోలీసు అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అమరవీరుల ఆశయ సాధనకు అందరూ కృషి చేద్దామని డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ ఎదుట ఉన్న అమరవీరుల స్తూపానికి డిఎస్పీ శ్రీనివాసులతోపాటు వన్‌టౌన్ సిఐ, నాగేంద్రప్రసాద్, టూ టౌన్ సిఐ రెడ్డప్ప, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటరాముడు, ఎస్సై గోపికృష్ణతోపాటు, ఏఎస్ఐ కేతన్న, వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ కలిసి అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి సెల్యూట్ చేస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. దేశానికి ప్రాణ త్యాగాలు అర్పించిన అమరవీరులకు రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎస్పీ మాట్లాడుతూ.. పరిరక్షణ, తీవ్రవాదులు, ఉగ్రవాదులు, మతవాదులు, అసాంఘీక శక్తుల నుంచి సామాన్య మానవులకు రక్షణ కల్పించేందుకు పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నామని ప్రతి పోలీసు దేశానికి వెన్నెముఖ లాంటి వారిని తెలిపారు. ఈ అమరవీరుల వారోత్సవాలు ఏడు రోజులపాటు జరుగుతాయని తెలిపారు. ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల దినోత్సవం

గుడిబండ, అక్టోబర్ 21 ప్రభాతవార్త



అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న పోలీసులు

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అమరవీరుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మునిప్రతాప్ వర్మ సైనిక్ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో ఎస్ఐ అన్యం ముని ప్రతాప్ వారి సిబ్బంది అమరవీరుల దినోత్సవం సందర్భంగా, గుడిబండ పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించి అనంతరం పోలీసు వ్యవస్థ రికార్డులు, చట్టాలు తదితర విషయాల గురించి వివరించారు. అలాగే అక్టోబర్ 21న మన దేశంకోసం సరిహద్దుల్లో ప్రాణాలు వదలి అసువులు బాసిన అమరవీరుల చరిత్ర గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ల వెంకటేష్, మహ్మద్ రఫీ, పాతన్న, మల్లికార్జున, హోంగార్డులు రామప్ప, చంద్రశేఖర్ తదితర పోలీసు స్బిబంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## తహశీల్దార్‌ను సన్మానించిన మండల సర్పంచులు

గోరంట్ల, అక్టోబర్ 21 ప్రభాతవార్త



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న సర్పంచులు

మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన మారుతిప్రసాద్‌ను సోమవారం మండల సర్పంచులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఆయనను వడిగేపల్లి, బూదిలి, పుడగుండ్లపల్లి, పాలసముద్రం, వెంకటరమణపల్లి, గడ్డంతాండా, వానవోలు సర్పంచులు నరసింహమూర్తి, అంజి, నర్సిరెడ్డి, చ్నినగంగప్ప, అశ్వర్థరెడ్డి, వాసునాయక్, శ్రీరాములుతో పాటు ముసలిరెడ్డి, గంగాధర్, తదితరులు తహశీల్దార్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## గోరంట్లలో గవాచి దొంగలు

**- చిత్రావతి నది సమీపంలో మోటర్ల దుకాణంలో చోరీ**

గోరంట్ల, అక్టోబర్ 21 ప్రభాతవార్త



దుకాణంలో క్లూస్‌టీంతో సిఐ

పట్టణంలోని పలు ప్రాంతాల్లో దొంగలు కొత్త తరహా చోరీలకు పాల్పడుతూ అర్ధరాత్రి సమయంలో పైకప్పులకు కన్నం వేసి లోనకు చొరబడి విలువైన వస్తువులను చోరీ చేస్తూ పోలీసులకు సవాల్‌గా మారుతున్నారు. ఇటీవల గోరంట్ల పట్టణంలోని ఎస్‌బిఐ సమీపంలో రెండు దుకాణాల్లో చోరీ చేసిన సంఘటనను 24 గంటల్లో గోరంట్ల పోలీసులు ఛేదించిన విషయం తెలిసిందే. అయితే అది మరువకముందే మరోమారు చిత్రావతినది సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాదాపీర్ మోటర్ల దుకాణంలో ఇదే తరహాలో దుకానం పైకప్పు రేకులను కట్ చేసి లోనికి చొరబడి విలువైన మోటర్లను రాగి వైరును చోరీ చేశారు. దీంతో దాదాపు 5 లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. అదేవిధంగా మరో కూల్‌డ్రింక్‌షాపులో ఇదే తరహాలో చోరీకి పాల్పడి 4 వేల రూపాయలను అపహరించినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సమాచారం తెలుసుకున్న సిఐ శేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుల ఆచూకి కోసం జిల్లా కేంద్రం నుండి క్లూస్‌టీంను రప్పించి ఆధారాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

05ATP21_05ATP21.qxd 21-10-2024 PM 10:23 Page 1



# రక్తదాన శిబిరానికి విశేష స్పందన



నివాళులు అర్పిస్తున్న డిఎస్‌పి రామకృష్ణ



రక్తదానం చేస్తున్న దృశ్యం

**యాడికి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయం ఆవరణలో సోమవారం లయన్స్‌క్లబ్, లియోక్లబ్ ఆధ్వర్యంలో ఆర్డీటి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి రామకృష్ణ, యాడికి సిఐ ఈరన్నలు హాజరయ్యారు. పోలీసు అధికారులు జ్యోతిప్రజ్వలన చేసి విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. రక్తదానం చేయడం వల్ల మరొక వ్యక్తి నిండు జీవితాన్ని కాపాడిన వారమవుతామన్నారు. ఎంతో మంది సరైన సమయంలో రక్తం అందక మృతి చెందుతున్నారని అలాంటి వారి కోసం ఆర్డీటి సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం పట్ల డిఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో 65 మంది రక్తదానం చేశారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో లయన్ రవికుమార్‌రెడ్డి, రవిప్రసాద్, సత్యనారాయణ, ఇస్మాయిల్, రామ్మోహన్‌రెడ్డి, కూచి సూర్యనారాయణ, కత్తి రమేష్, శేషానందరెడ్డి, మురళీకృష్ణ, అల్లాబకాష్, రాజశేఖర్, ప్రసాద్, వికాస్ స్కూల్ రామకృష్ణ, నిడనాడు రామకృష్ణ, లియో అధ్యక్షులు మంజునాథ్, ప్రవీణ్, గ్రామ పెద్దలు రామ్మోహన్‌రెడ్డి, హరి, చందన రామాంజినేయులు, రంగనాథ్, సంజు, లయన్స్, లియో సభ్యులు, ఆర్డీటి సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూ వికాస్ పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**యాడికి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువులో న్యూ వికాస్ పాఠశాలలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. కరస్పాండెంట్ రామకృష్ణ పోలీసుల అమరవీరుల స్థూపం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి అమరులైన పోలీసులకు నివాళులు అర్పించారు. 1959 అక్టోబర్ 22న భారత్ - చైనా సరిహద్దు ప్రాంతం సియాచిన్‌లోకి చైనా బలగాలు అక్రమంగా ప్రవేశించడంతో అక్కడ విధి నిర్వహణలో వున్న 21 మంది సిఆర్‌పిఎఫ్ పోలీసులు చైనా బలగాలతో వీరోచితంగా పోరాటం చేశారన్నారు. ఇందులో పది మంది పోలీసులు వీరమరణం పొందారన్నారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం వారి త్యాగానికి గుర్తుగా పోలీసుఅమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామని ఆయన విద్యార్థులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ రజిత, ఉపాధ్యాయులు అనిత, అమల, గీత, కృష్ణవేణి, ప్రియాంక, షకీలా, జాహ్నవి, ధరని, రాజు, సంధ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ




కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు

**యల్లనూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిచడం జరుగుతోందని ఇన్‌చార్జ్ ఎంపిడిఓ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఉపాధి హామీ పథకంనపనులకు సంబంధించి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు, ఏపిఓ షబ్బీర్‌బాష, పంచాయతీ కార్యదర్శి సలీం, జెఇ నరేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డులో నెలకొన్న సమస్యలపై సమీక్షా సమావేశం



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని నందలపాడు-1 సచివాలయంలో సోమవారం వార్డులో నెలకొన్న సమస్యలపై కౌన్సిలర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ వార్డులో ఏమైనా సమస్యలు వుంటే సత్వరం పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి శుక్రవారం వార్డులో ఎఎన్‌ఎం, శానిటరీ సిబ్బంది కలిసి ఫ్రైడే డ్రైడే కార్యక్రమం తప్పకుండా నిర్వహిస్తూ డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. అలాగే ఏమినిటీస్ సెక్రటరీతో మాట్లాడుతూ వార్డులో ఎక్కడైనా డ్రైనేజి బ్లాక్ అయితే వెంటనే క్లీన్ చేయించాలన్నారు. వెల్ఫేర్ సెక్రటరీతో మాట్లాడుతూ రాబోవు రోజుల్లో వచ్చే ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ నారాయణస్వామి, జీనత్‌భాను, లక్ష్మీప్రసన్న, సుధాకర్, శిల్ప, వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

## డియస్‌సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్

**తలుపుల,అక్టోబర్21,ప్రభాతవార్త:**

శ్రీ కందికుంట నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో తలుపుల మండలంలోని డి,యస్,సి అభ్యర్థులకు ఉచిత కోచింగ్ ఇస్తున్నట్లు ట్రస్ట్ వారు తెలిపారు.ఆశక్తి ఉన్న అభ్యర్థులు,ప్రభుత్వ ఉన్నత పాఠశాల యందు సాయంత్రం 4.30గం నుంచి 7.00గం వరకు జరుగుతుందని తలుపుల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు తెలియచేశారు.కోచింగ్ తీసుకొనే అభ్యర్థులు ఈ నెంబర్లు 9966801286, 9490008362, 9491358310 నెంబర్లకు కాల్ చేసి సంప్రదించాలని తెలిపారు.

## రీ సర్వే రిమార్కుల పరిష్కారానికి గ్రామ సభలు

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 21, ప్రభాతవార్త**

మండలంలోని రీ సర్వే ప్రక్రియ జరిగిన రెవెన్యూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ అనంతాచారి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ నరసంబొట్లపల్లి, యం కొత్తపల్లి, టి కుంట్లపల్లి, వీరఓబునపల్లి గ్రామాలలో భూములకు సంబంధించిన రీసర్వే పూర్తి అయిందన్నారు. అయితే రైతుల నుంచి ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే మరొక్క సారి ఆయా గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. నేడు యంకొత్తపల్లి, 24న తుమ్మల కుంట్లపల్లి, 27న వీరఓబునపల్లి రెవెన్యూ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తా మన్నారు. రైతులు రీ సర్వే సమస్యలపై అర్జీలు ఇవ్వాలని తహశీల్దార్ వెల్లడించారు.

## ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 53 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, ఎంవి సుబ్బయ్య, బొంత రామాంజనేయరెడ్డి, బిజెపి శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## చింతకుంటలో పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం నిర్వహిస్తున్న దృశ్యం

**పుట్లూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండలంలోని చింతకుంట గ్రామంలో సోమవారం తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో ఏఇఓ హరి వేరుశనగలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతు నారాయణస్వామి పొలంలో పంటకోత ప్రయోగం నిర్వహించగా 2.15 కిలోల దిగుబడి వచ్చింద న్నారు. వర్షాభావం వల్ల వేరుశనగ దిగుబడి తగ్గిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఓ విజయకుమార్, ఎంపిఇఓ సుమతి, విఆర్ఎ నల్లప్ప, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులు టివి, సెల్‌ఫోన్‌కు ఆకర్షితులు కారాదు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు

**యల్లనూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

విద్యార్థులు టివి, సెల్‌ఫోన్లకు ఆకర్షితులు కారాదని హెడ్‌కానిస్టేబుల్ వి.వెంకటేశ్వర్లు విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని వెన్నపూసపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు కాలంతో పోరాడుతూ తమ దైనందిన కార్యక్రమాలను నిర్వహించుకోవాలన్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న టివి, సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. డయల్ 100 పట్ల అవగాహన కలిగి వుండాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి

**పెద్దవడుగూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న జాఫర్

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సోమవారం పెద్దవడుగూరు మండల కేంద్రంలోని షాదీఖానాలో జరిగిన సిపిఐ జనరల్‌బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ మూడవ సారి ఎ్నకల్లో బిజెపికి కూటమికి 400 సీట్లు వస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామని మాట్లాడే స్వేచ్ఛ వాక్ స్వాతంత్ర్యం, ఉన్న దేశం భారతదేశమని ప్రజాస్వామ్య దేశంలో లౌకిక అనే పదాన్ని తొలగిస్తామని దుర్మార్గమైన కుట్రలు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి వెంకట రాముడు యాదవ్, నాయకులు సూర్యనారాయణరెడ్డి, రంగయ్య, పోల రంగ స్వామి, నారాయణ, లింగన్న, ఏటిఐయుసి మండల కార్యదర్శి హుస్సేన్‌పీరా, శాఖ కార్యదర్శి రంగనాయకులు, శ్రీనివాసులురెడ్డి, అల్లా బకాష్, శేషు గోపాల్, సుధాకర్‌గౌడ్, నాగేంద్ర,, మల్లికార్జున, రామాంజినేయులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.


## చౌడేశ్వరిదేవి ఆలయంలో చోరీ

**పుట్లూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

మండలంలోని నారాయణరెడ్డిపల్లి గ్రామంలోని శ్రీచౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఆలయంలోని 10 వేల రూపాయల నగదు, రెండు జతల ఇత్తడి దీపాలను అపహరించారు. మొత్తం దొంగతనం జరిగిన విలువ దాదాపు 18 వేల రూపాయల వరకు వుంటుందని సమాచారం. ఆలయ పూజారి నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

## జలపాతం గలగలలు

### -ప్రకృతి అందాలకు నిలయంగా బట్రేపల్లి జలపాతం



**తలుపుల,అక్టోబర్21,ప్రభాతవార్త:**

గురువారం రాత్రి కురిసిన వర్షానికి బట్రేపల్లి జలపాతం రెండు ఎతైన కొండల మద్య జాలువారుతూ పొంగి పొర్లుతోంది. రెండు పాయలుగా విడిపోయి ప్రవహించే ఈ దృశ్యాన్ని చూడటానికి రెండు కళ్ళు చాలవు.కదిరి పులివెందులకు వెళ్ళే మద్య దారిలో బట్రేపల్లికి కిలోమీటరు దూరంలో ఉండే ఈ జలపాతం ఆ దారుంచి వెళ్ళే ప్రతి ఒక్కరిని ఆకర్షిస్తోంది.ప్రతి సంవత్సరం ఈ జలపాతాన్ని చూడటానికి కదిరి చుట్టు ప్రక్కలే కాకుండా ఇతర జిల్లాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు.ఈ యేడు వర్షాలు ఆలస్యమైనా గురువారం మాత్రం కురిసిన వర్షానికి జలపాతం పరవళ్ళు తొక్కుతోంది.ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా చేస్తామని ప్రభుత్వం ప్రపోజల్స్ కూడా రెడీ అయినట్లు సమాచారం.

## రోడ్డుకు ఇరువైపుల చెట్లు -పొంచి ఉన్న ప్రమాదాలు



రోడ్డు మలుపు వద్ద కనిపించని వాహనాలు

**తలుపుల,అక్టోబర్21,ప్రభాతవార్త:**

మండలకేంద్రం నుంచి ఓబుళరెడ్డిపల్లికి వెళ్ళే దారిలో రోడ్డుకు ఇరువైపుల చెట్లు పెరిగిపోవడంతో వరుస ప్రమాదాలతో మరణాలు జరుగుతున్నా పట్టిచ్చుకొనే నాథుడే లేరని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా రోడ్డు మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో గరికపల్లి, నూతన కాల్వ ,పొలిమేరమ్మమిట్ట, పల్లవాండ్ల పల్లి సమీపాలలో ఎక్కువగా ప్రమాదాలతో మరణాలు జరుగుతున్నాయి. నెల రోజుల్లోనే ముగ్గరి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. ఇప్పటికైనా సంబందిత అదికారులు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

## పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై గోపి

**తనకల్లు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:**

తనకల్లు పోలీస్‌స్టేషన్ నందు ఆవరణమునందు పోలీసు అమరవీరుల సంస్మరణ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్సై గోపి నిర్వహించారు. విద్యార్థులకు, పోలీస్‌స్టేషన్ నందుగల రికార్డ్స్, విహెచ్ఎఫ్ సెట్ మరియు పోలీసుల విధుల గురించి వివరించమైంది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐఎస్‌పి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా రాజేష్‌కుమార్ నియామకం

**నంబులపూలకుంట, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



నిన్నటి రోజు అనగా శనివారం జరిగినటువంటి ఎఐఎస్‌పి రాష్ట్ర నాయకుల సమావేశంలో యాదల్ల రాజేష్‌కుమార్‌ను రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాల నుంచి విద్యార్థుల, యువకుల, నిరుద్యోగుల, ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశాము, అందుకు గుర్తించి నాకు ఈ బాధ్యతలు ఇచ్చినటువంటి నాయకులందరికీ విప్లవాది ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. అదే విధంగా భవిష్యత్తులో విద్యార్థి యువజన, ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని, అలాగే ఆల్ ఇండియా స్టూడెంట్ పవర్ అభివృద్ధి కోసం పని చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నా అని పేర్కొన్నారు.

## గ్రామ సభలో వినతుల వెల్లువ

**గాండ్లపెంట, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

మండలంలోని మద్దివారి ముందు పంచాయితీలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. గ్రామసభలో 20 వరకు దరఖాస్తులు సమర్పించారు. అయితే పరిష్కారం చూపించాలని మండల తహశీల్దార్‌కి రైతులు విన్నవించు కున్నారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్లు విఆర్‌ఓలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాడేవారే నిజమైన నాయకులు



హరిమోహన్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు

**కదిరి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

ఆర్టిసి ఉద్యోగుల సమస్యలపై పోరాడిన వారే నిజమైన నాయకులని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్టిసి డిపోలో జూన్ మాసంలో పదవీ విరమణ పొందిన అసిస్టెంట్ మేనేజర్ మోకా హరిమోహన్‌కు సోమవారం విజయవాడలోని ఎన్‌ఎంయుఏ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు రమణారెడ్డి చేతులు మీదుగా దుశ్శాలువాతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎన్‌ఎంయుఏ నాయకులు పాల్గొన్నారు.

## మండలంలో పలు గ్రామాల్లో భూముల రీ సర్వే

**గాండ్లపెంట, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు గాండ్లపెంట మండలంలోని వివిధ గ్రామములలో భూముల రీ సర్వే చేయనున్నట్లు తహశీల్దారు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను రైతులు పట్టాదారు పాసుపుస్తకం, 1బి నకలు (మీ భూమి నందు), పట్టాదారు యొక్క ఆధార్‌కార్డు, పట్టాదారు యొక్క మొబైల్ నెంబర్‌లను సిద్దంగా ఉంచుకోవాలన్నారు. ఈ నెల 23న చామచేనుబైలు గ్రామం, 24న మదుగులవారిగొంది, 25న జీనులకుంట, 26న కురుమామిడి, 27న తుమ్మలబైలులో నిర్వహించడం జరుగుతుందన్నారు.

## సివిరామన్ కళాశాల అక్రమాలపై ఎస్‌పికి ఫిర్యాదు చేస్తాం

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి పట్టణ సమీపంలోని సర్ సివి రామన్ కళాశాలలో జరిగిన అక్రమాలపై జిల్లా ఎస్‌పికి ఫిర్యాదు చేస్తామని తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నివాసంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై మరోసారి మండిపడ్డారు. కళాశాల అనుమతులు రద్దు చేయాలంటూ జె.సి వరుసగా నిరసనలు చేపట్టారు. కళాశాలలో జరిగిన అక్రమాలను లిఖితపూర్వకంగా న్యాక్ బృందానికి ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదన్నారు. న్యాక్ బృందాన్ని సైతం సివి రామన్ కళాశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి ప్రలోభాలకు గురిచేశారని ఆరోపించారు. ప్రైవేటు హోటళ్లలో న్యాక్ బృందాన్ని భాస్కర్‌రెడ్డి కలవడాన్ని ఫోటోతో సహా మీడియా ముందు వుంచారు. కళాశాలపై ప్రభుత్వం విచారణ చేపట్టి అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక విద్యార్థికి బదులు మరొక విద్యార్థితో పరీక్షలు వ్రాయించిన ఘనత సివి రామన్ కళాశాల యాజమాన్యానికి చెల్లుతుందని దుయ్యబట్టారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న సివి రామన్ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో కళాశాలలో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా డిఎస్‌పి, జిల్లా ఎస్‌పిలకు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పాతకోటలో పర్యటించిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి



వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

పట్టణంలోని పాతకోటలో సోమవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో తిరుగుతూ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అభిమానులు వున్నారు.

## ప్రభుత్వ సంస్థలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు

**యాడికి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**



స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ సంస్థలకు గత మూడు రోజుల నుండి విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారని ట్రాన్స్‌కో ఏఇ రాజారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి వరకు 32 మీటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందుగా ప్రభుత్వ సంస్థలకు తరువాత ప్రైవేటు సంస్థలకు వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వీటి వల్ల విద్యుత్ ఆదా చేయడంతో పాటు మరెన్నో సౌలభ్యాలు వుంటాయన్నారు. ఇందులో భాగంగా వీధిలైట్లకు సోమవారం విద్యుత్ అధికారులు స్మార్ట్ మీటర్లను అమర్చారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ వెంకటనారాయణ, సిబ్బంది అన్సర్, పంచాయతీ కార్యదర్శి అరుణ్‌బాబు పాల్గొన్నారు.

## పంటల పరిశీలన వ్యవసాయ అధికారులు




పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు, రైతులు

**తనకల్లు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని బొంతలపల్లి రైతులు సాగు చేసిన పంటలను బొంతలపల్లి జి.హరి అనే రైతు వేరుశెనగ పొలమును సందర్శించి పొలమును పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేరుశెనగలో యాజమాన్య పద్దతులు పాటించిన రైతులను ఎంపిక చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, వెరుశెనగలో మంచి యాజమాన్య పద్దతులు పాటించిన రైతులను ఎంపిక చేసి తద్వారా ఆ రైతులకు ధృవీకరణ పత్రాలు అందించడానికి ఎక్స్టర్నల్ ఇన్స్పెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఆధ్వర్యంలో పొలంను పరిశీలించడం జరుగుతుందున్నారు. రైతులు పండించిన పంటలు బెంగళూరులోని ల్యాబ్‌కు ఏపీఎస్‌ఓపిసిఏ ద్వారా పంపించడానికి ప్రయత్నాస్తున్నామన్నారు. పంటలోన్ల పురుగుల మందు ఆ వశేషాలు రసాయనిక ఎరువుల అవశేషాలు ఎంత మోతాదులో ఉన్నాయో పరీక్షకు పంపించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చిన వెంటనే రైతులను ఎంపిక చేసి ధృవీకరణ పత్రాన్ని అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కదిరి వ్యవసాయ సహాయ సంచాలకులు సత్యనారాయణ, హనుమంతు, సీఈఓ చౌడేశ్వరీ, ఏపీఓ నళిని, వంతలపల్లి ఎఫ్ఈఓ సభ్యురాలు మరియు మండల వ్యవసాయ అధికాంరి శ్రీహరినాయక్ మరియు లక్ష్మీ దేవిప్రియ, మండల వ్యవసాయ అధికారి గాండ్లపెంట మరియు బొంతలపల్లి రైతులు అదే విధంగా వేమ నారాయణ, ఎంపిఈఓ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాఠశాలకు అతీసమీపంలో మద్యం దుకాణాలు



తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న ఆర్సీపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, అక్టోబర్ 21, ప్రభాతవార్త**

పాఠశాల, ప్రార్థనా మందిరాలకు అతిసమీపంలో మండల కేంద్రంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారని వాటిని ఊరి వెలుపలకు తరలించాలని తహశీల్దార్ అనంతాచారికి ఆర్సీపి జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నా, రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్రలు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆదోళనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా స్థానికంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, ప్రార్థనా మందిరం(మసీదు)కు అత యంత సమీపంలో ఉన్నాయన్నారు. అంతే కాకుండా కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందన్నారు. ప్రధానంగా సాయంత్రం పాఠశాలలు వదిలినప్పుడు మందు బాబులు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. కనుక మద్యం దుకాణాలను గ్రామ శివార్లలో నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్సీపి మండల కార్యదర్శి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

